# నెబుకద్నెజరు

బైబిల్లో ప్రస్తావించిన బబులోను రాజైన నెబుకద్నెజరు వాస్తవానికి రెండవ నెబుకద్నెజరు. నవీన బబులోను సామ్రాజ్యానికి చక్రవర్తి అయిన రెండవ నెబుకద్నెజరు సుదీర్ఘకాలం పరిపాలించి సఫలీకృతుడయ్యాడు. ఇతని పరిపాలనా కాలంలో (క్రీ.పూ 605-562) బబులోను సామ్రాజ్య వైభవం పతాకస్థాయికి చేరింది. ఈ చక్రవర్తి కాలంలో ఉత్తరంలో వున్న మాద్య రాజ్యం (ఇరాన్ వాయవ్యభాగం), పడమరలో వున్న ఐగుప్తు రాజ్యం బబులోనుకు ప్రధాన శత్రువులు. పాలస్తీనా సిరియా ప్రాంతాల్లోని వ్యాపారాలన్నా రేపు పట్టణాలన్నా ఈజిప్టుకు ఆసక్తి మెండు గనుక సాధ్యమైనప్పుడల్లా ఈ రెండు రాజ్యాలు బబులోనుకు వ్యతిరేకంగా ఈ ప్రాంతాల్లో తిరుగుబాటులను ప్రోత్సహించేవి. క్రీ.పూ.605లో కర్కెమిషు వద్ద జరిగిన యుద్ధంలో ఈజిప్టురాజైన నెకోను నెబుకద్నెజరు ఓడించి అతణ్ణి ఈజిప్టుకు తరిమికొట్టాడు (2 రాజులు 24:7).

బబులోను సామ్రాజ్యానికి ముఖ్యపట్టణమైన బబులోను నగరంలో నెబుకద్నెజరు అనేక భవననిర్మాణ కార్యక్రమాలు చేపట్టాడు. పట్టణ ప్రాకారాలను పటిష్టపరచి బబులోను నగర ప్రధాన ద్వారాన్ని (ఇష్తార్ ద్వారం) నిర్మించాడు. బబులోను ప్రముఖదేవత మర్దోక్ పట్ల భక్తి ప్రపత్తులు కలిగిన నెబుకద్నెజరు ఆ దేవత కొరకు ఆలయాన్ని నిర్మించాడు. ఇతర రాజ్యాలను జయించడంలోనూ తిరుగుబాటులను అణచివేయంలోనూ నెబుకద్నెజరుకు సాటి యెవరూ లేరు. నెబుకద్నెజరు యూదాను శిక్షించాడు. యూదా రాజైన యెహోయాకీనును పట్టణ ప్రముఖులను నిపుణులైన పనివారిని బబులోనుకు తరలించుకుపోయాడు. క్రీ.పూ. 587లో యూదా రాజైన సిద్కియా చేసిన తిరుగుబాటును అణచివేయడానికి నెబుకద్నెజరు మరోసారి యూదా మీదకు దండెత్తాడు (2 రాజులు 24:18-20). ఈసారి నెబుకద్నెజరు యెరూషలేంను నలువైపుల నుంచి ముట్టడించి యూదాలోని అనేక చిన్న పట్టణాలను నాశనం చేశాడు. యూదా రాజైన సిద్కియా యెరూషలేం నుంచి రహస్యంగా తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించాడు గాని కుటుంబంతో సహా పట్టుబడ్డాడు. సిద్కియా కళ్లెదుటే అతని కుమారులను చంపివేశారు. సిద్కియా కళ్లను ఊడబెరికి అతణ్ణి బబులోనుకు బందీగా ఈడ్చుకుపోయారు (2 రాజులు 25:1-7).

క్రీ.పూ.586 ఆగష్టు నెబుకద్నెజరు సైన్యం యెరూషలేం ప్రాకారాలను తుత్తునియలు చేసి పట్టణాన్ని సమూలంగా పాడుచేసింది. (2 రాజులు 25:8-21). దేవాలయాన్ని రాజభవాన్ని పట్టణంలో అధికభాగాన్ని అగ్నికి ఆహూతి చేశారు. దేవాలయంలోని పవిత్ర ఉపకరణాలను

సంపదను దోచుకొని బబులోనుకు తరలించుకుపోయారు. తుదకు యూదా ప్రముఖులను పట్టణ ప్రజల్లో అనేకులను బబులోనుకు బందీలుగా చెరగొనిపోయారు. పారసీక రాజైన కోరెషు బబులోనును ఓడించి క్రీ.పూ.539లో చెరలోవున్న యూదా ప్రజలకు స్వేచ్ఛ ప్రసాదించేవరకు వారక్కడే వున్నారు.

యిర్మీయా ప్రవక్త నెబుకద్నెజరు గురించి రెండు విషయాలను ప్రస్తావించాడు. మొదటిది: యూదా జరిగించిన పాపాలనుబట్టి దేవుడు నెబుకద్నెజరును యూదాను శిక్షించడానికి వాడుకున్నాడు కాబట్టి యెరూషలేం పతనానికి ముందే యూదా అధిపతులు తల ఒగ్గి ఘోరనాశనం నుంచి యెరూషలేంను యూదాను కాపాడుకోవాలని యిర్మీయా ప్రవక్త హెచ్చరించాడు. రెండవది : యెరూషలేం పతనం తర్వాత, బబులోను మీదకు కూడా తీర్పు రానున్నదని యిర్మీయా ప్రవక్త సెలవిచ్చాడు. నెబుకద్నెజరు రాజ్యానికి తాను విత్తిన దాన్ని కోసుకునే దినం ఎదురౌతుంది (యిర్మీయా 50, 51 అధ్యాయాలు).